ఒకేషనల్ కళాశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈఓ కిషన్

సుభాష్‌నగర్: డీఐఈఓ కిషన్ మంగళవారం బహదూర్‌పల్లిలోని కేఎం పాండు మెమోరియల్ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాల తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతి, హాజరు, కోర్సు, సంబంధిత వాటిపై ప్రశ్నలు అడిగారు. కాలేజీలో చేపడుతున్న బోధన ప్రణాళిక, స్టూడెంట్స్ అటెండెన్స్ రిజిస్టర్స్‌లను పరిశీలించారు. అనంతరం సమావేశంలో లెక్చరర్స్‌కు, సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీమతి షేక్ మైమున్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



రాజిరెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: బీజేపీ కొంపల్లి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి రాజిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ శ్రేణులు సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు మల్లారెడ్డి, రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు జనార్దన్ రెడ్డి, కొంపల్లి పట్టణ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్, రాష్ట్ర మహిళా మోర్చ అధికార ప్రతినిధి సరిత రావు, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, నాయకులు శంకర్ రెడ్డి, రాజు, మాధురి, మధు, మహేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయరూ!

సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్‌లో సీసీ రోడ్లు లేక వర్షం పడ్డ ప్రతిసారి బురదమయంగా మారుతున్నాయి. సీసీ రోడ్లు వేయాలని కాలనీ వాసులు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదు. అదేవిధంగా భూగర్భ డ్రైనేజీ లీకైన ప్రతిసారి మురుగునీరు రోడ్లపై పారుతుందని రాంరెడ్డినగర్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాంరెడ్డినగర్‌లో సీసీరోడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – జీడిమెట్ల



రాంరెడ్డినగర్‌లో మట్టిరోడ్డు..

రేపటి నుంచి ఆలయ ఉత్సవాలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాలు ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజులు పాటు నిర్వహించనున్నారు. 16న సాయంత్రం 6 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణ, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, అంకురార్పణ, తీర్థ ప్రసాదగోష్టి, 17న ఉదయం 8.30 గంటలకు యాగశాల ప్రవేశం, శాంతిపాఠం, అగ్ని ప్రతిష్ఠ, నవకలశ స్నపనం, మధ్యాహ్నం 12 గంటలకు నిత్య పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు విష్ణుసహస్ర నామ పారాయణం, మూలమంత్ర హోమం, 18న ఉదయం 8 గంటలకు యాగశాలలో శాంతిపాఠం, నిత్య పూర్ణాహుతి, శ్రీవారి పవిత్ర ఆరోహణం, మధ్యాహ్నం 12 గంటలకు పవిత్రోత్సవ శ్రీవారి విశేష ప్రత్యేక కల్యాణం, సాయంత్రం స్వామివారి పల్లకీ సేవ, ఈ నెల 19న ఉదయం 8 గంటలకు యాగశాలలో శాంతిపాఠం, నిత్య హోమం, సుదర్శన నరసింహ హోమం, పూర్ణాహుతి, శ్రీవారికి పవిత్ర ఆరోహణ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపాకటాక్షాలకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ కోరింది.

టీజీహెచ్‌బీ ఆధ్వర్యంలో నేడు క్రాకర్స్ దుకాణాల వేలం

రంగారెడ్డినగర్: దీపావళి పండుగను పురస్కరించుకుని బుధవారం దుకాణాల వేలం నిర్వహిస్తున్నట్లు టీజీహెచ్‌బీ నార్త్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అంకమరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐడీపీఎల్ జంక్షన్‌లోని టీజీహెచ్‌బీకి చెందిన ఓపెన్ లాండ్‌లో వెయ్యి చదరపు అడుగుల చొప్పున ఈ నెల 16 నుంచి 23వ తేది వరకు నాలుగు దుకాణాల నిర్వహణకు ఓపెన్ ఆక్షన్ నిర్వహిస్తున్నామని, ఒక్కో దుకాణ ఏర్పాటుకు రూ.5 లక్షలు ధర నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనదలిచే వారు రూ.2 లక్షల డీడీని డైరెక్టర్ ఈడీఎస్ పేరిట తీసి కేపీహెచ్‌బీ మెయిన్ రోడ్డులోని శివపార్వతి థియేటర్ సమీపంలోని టీజీహెచ్‌బీ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో అందజేయాలని, సాయంత్రం 4 గంటల నుంచి వేలం కొనసాగుతుందన్నారు.

కేపీహెచ్‌బీ పరిధిలో..

కేపీహెచ్‌బీ పరిధిలోని ఫేజ్ 3లోని చైతన్య ఫుడ్ కోర్టును ఆనుకుని ఉన్న టీజీహెచ్‌బీ స్థలంలో 726 అడుగుల స్థలం ఒక దుకాణానికి రూ.8.5 లక్షలు, రెండు దుకాణాలు ఒక్కొక్కటి 823.33కు రూ.9.50 లక్షలు, రమ్యగ్రౌండ్స్ లోని 266.66 అడుగుల చొప్పున నాలుగు దుకాణాలకు ఒక్కొక్కటికి రూ.3 లక్షలు, కైతుల్లాపూర్‌లోని ఓపెన్ ల్యాండ్‌లో 1066 అడుగుల చొప్పున నాలుగు దుకాణాలకు ఒక్కొక్కటికి రూ.4 లక్షలు చొప్పున వేలం ధర నిర్ణయించినట్లు టీజీహెచ్బీ వెస్ట్ జోన్ ఈఈ ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు కేపీహెచ్‌బీ మెయిన్ రోడ్డులోని శివపార్వతి థియేటర్ సమీపంలోని టీజీహెచ్‌బీ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.

9 మంది వ్యభిచారుల అరెస్టు

మూసాపేట: వీధి వ్యభిచారం చేస్తున్న 9 మందిని అరెస్టు చేసిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలో 9 మంది మహిళలు రోడ్డుపై వెళ్తున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తూ అసభ్య సైగలు చేస్తున్నారు. వారిని పెట్రోలింగ్ పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి బైండోవర్ చేశారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

సుభాష్‌నగర్: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటకు చెందిన నారాయణరెడ్డి, లలిత దంపతులు కొన్ని సంవత్సరాల క్రితం బతుకుదెరువు నిమిత్తం సూరారం రాజీవ్ గాంధీనగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. నారాయణరెడ్డి తాగుడుకు బానిస కావడంతో దంపతుల మధ్య గొడవలు జరిగాయి. కొంతకాలంగా భార్య తన ఇద్దరు పిల్లలతో శివాలయ నగర్‌లో వేరుగా ఉంటుంది. కాగా నారాయణరెడ్డి రాజీవ్‌గాంధీనగర్‌లోని మెగా ఇంజనీరింగ్ కంపెనీలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. తరచు మద్యం తాగుతూ వస్తుండటంతో అతడిని కంపెనీ యాజమాన్యం తొలగించింది. మనస్థాపానికి గురైన నారాయణరెడ్డి మంగళవారం తెల్లవారుజామున తాను పని చేసిన కంపెనీ వెనకాల ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కంపెనీకి వచ్చిన సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జగద్గిరిగుట్ట: త్వరలోనే పెండింగ్ పనులు పూర్తి చేస్తామని కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్, ఆర్‌జీకేలో వాటర్ వర్క్స్ డీజీఎం మాధవి, సిబ్బందితో కలిసి పర్యటించారు. పలు సమస్యలపై ప్రజలు విన్నవించారు. యూజీడీ, వాటర్ లైన్లు త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొలుకుల జైహింద్, ధర్మారపు అంజయ్య, భూపతి రెడ్డి, పరశురాములు, చిన్న, కనకాచారి, రిజ్వాన్, మహేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలి

రంగారెడ్డినగర్: ఏదైనా వస్తువును కొనుగోలు చేసే ముందు దాని ప్రమాణం, నాణ్యతలపై అవగాహన కలిగి ఉండాలని ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే అన్నారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం రంగారెడ్డి నగర్ డివిజన్ గిరినగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హాల్ మార్క్, ఐఎస్ఐ, రేరా, ఎఫ్ఎస్ఎస్ ఐ, నేషనల్ బిల్డింగ్ కోడ్, నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్ పైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ శ్రీకాంత్ కట్టె, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు..



అవగాహన కల్పిస్తున్న మధుబాబు

నీటి సమస్యను పరిష్కరించాలి



ఎండీకి సమస్యను వివరిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: సాయి నగర్ కాలనీ నీటి సమస్యపై బీజేపీ అధ్యక్షులు ప్రసాద్‌రాజు సోమవారం వాటర్ వర్క్స్ ఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండీ సానుకూలంగా స్పందించి వారం రోజుల్లో నీటి సమస్యకి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం తప్పదని అన్నారు. కార్యక్రమంలో గజ్జెల్లి సంతోష్ కుమార్, భూపాల్‌రెడ్డి, వినీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాసు పుస్తకాలు ఇవ్వడం లేదని ఒంటిపై పెట్రోల్ పోసుకున్న యువకుడు

- మండల కార్యాలయం ముందు హల్‌చల్..
- పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన గొడవ



కార్యాలయం ముందు బైఠాయించిన సిద్ధూ నాయక్

దుండిగల్: తన భూమికి సంబంధించిన పాసు పుస్తకాలు ఇవ్వడం లేదని నిరసిస్తూ ఓ యువకుడు మండల రెవెన్యూ కార్యాలయం ముందు ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానని హల్‌చల్ చేశాడు. పోలీసులు రంగ ప్రవేశం చేసి నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది. బాధితుల వివరాల ప్రకారం...దుండిగల్ తాండా–1కు చెందిన సిద్ధూ నాయక్ కుటుంబానికి గాగిల్లాపూర్ బూర్జకుంట సమీపంలోని సర్వే నెంబరు 148,150లో 14 గుంటల స్థలం ఉంది. కాగా తమ స్థలానికి సంబంధించిన పాస్ పుస్తకాల కోసం గండిమైసమ్మ–దుండిగల్ మండల రెవెన్యూ కార్యాలయం చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో సిద్ధూ నాయక్ మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి రెవెన్యూ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేశారు. తనతో పాటు తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంటానని హల్‌చల్ చేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న దుండిగల్ పోలీసులు అతనికి నచ్చజెప్పి పంపించడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇదే విషయంపై 'సాక్షి' మండల తహసీల్దార్ సయ్యద్ మతిన్‌ను వివరణ కోరగా సర్వే నెంబరు 148, 150 భూదాన్ భూములని, అవి నిషేధిత జాబితాలో ఉన్నాయని, గతంలో ఇదే 14 ఎకరాల స్థలం బానోత్ లక్ష్మి అనే మహిళ ఇతరులకు విక్రయించిందని, ఈసీలో సైతం ఇతర పేర్లపై ఉందని, భూదాన్ భూములకు సంబంధించి పాస్ పుస్తకాలను అందించడం వీలు కాదన్నారు.